www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 11 ఏప్రిల్ 2024
8 పేజీలు






తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ

జోరందుకున్న ప్రచారం

- మరో వారంలో నామినేషన్ల ఘట్టం
- ఓటర్లను ఆకట్టుకునే పనిలో అభ్యర్థులు
- ప్రధాన సమస్యలు గాలికి...




ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో పార్టీల ప్రచారం జోరందుకుంది. మరో వారం రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. 25 వరకూ నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన జరుగుతాయి. 29 వరకూ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎన్నికల ప్రక్రియ ఊపందుకోవడంతో అభ్యర్థులు ప్రచారంలో మరింత స్పీడును పెంచారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా రోజంతా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. గెలుపే లక్ష్యంగా ఇంటింటా ప్రచారంలో తిరుగుతున్నారు. ప్రధానంగా కాకినాడ జిల్లా పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేస్తుండడంతో ఈ జిల్లాలో రాజకీయ వేడి మరింత పెరిగింది. అధికార పార్టీ నుంచి బరిలో ఉన్న వంగా గీత ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. వైసిపి సంక్షేమ పథకాలను వివరిస్తూనే తన హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేకేళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని మరోసారి పిఠాపురం నుంచి తనకే అవకాశం ఇవ్వాలంటూ కోరుతున్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఇటీవల నాలుగు రోజులు పాటు నియోజకవర్గంలోనే గడిపారు. అవకాశం ఉన్న కొన్నిచోట్ల ప్రచారంలో పాల్గొన్నారు. మంగళవారం ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు.

పిఠాపురం ప్రజలు తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని, అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళం ఎత్తి పిఠాపురాన్ని ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి చేసి చూపెడతానంటూ ఆయన హామీ ఇస్తున్నారు. ఆధ్యాత్మిక రాజధానిగా తీర్చిదిద్దుతానని చెప్పుకొస్తున్నారు. ఇటు కాకినాడ సిటీలో ప్రచారం జోరుగా సాగుతోంది. అధికారపక్షం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి బరిలో ఉన్నారు. సుమారు రూ.1000 కోట్లతో స్మార్ట్ సిటీని అన్ని రకాలుగా అభివద్ధి చేశామని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలంటే తిరిగి వైసిపిని గెలిపించాలంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. వైసిపి నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని ఇటు కొండబాబు కూటమి అభ్యర్థిగా ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. టిడిపి హయాంలో జరిగిన అభివద్ధిని వివరిస్తూనే, అధికారపక్ష అరాచక పాలనపై ఆయన ధ్వజమెత్తుతున్నారు. కాకినాడ రూరల్, పెద్దాపురం, తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో కూడా ప్రచారం జోరుగా సాగుతోంది. వారం రోజుల్లో నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుండడంతో అభ్యర్థులు ఇప్పటికే ముహూర్తాలను ఖరారు చేసుకున్నారు.

ప్రధాన సమస్యల ప్రస్తావన ఏదీ..?

కాకినాడ జిల్లాలో అనేక ప్రధాన సమస్యలు ఏళ్ల తరబడి ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. ప్రధానంగా ఏలేరు ఆధునికీకరణ లేకపోవడంతో రైతులకు కష్ట నష్టాలు తప్పడం లేదు. పాలకులు సుద్దగడ్డ ఆధునికీకరణ మరిచిపోవడంతో గొల్లప్రోలు వాసులకు ప్రతి సంవత్సరం ముంపు సమస్య వేధిస్తూనే ఉంది. వైసిపి ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇళ్ల స్థలాలను ఇచ్చింది. అయితే ఈ కాలనీల్లో కనీస సౌకర్యాలు కరవడంతో అనేకమంది పేదలు నేటికీ పూర్తిస్థాయిలో ఇళ్లను నిర్మించు

2లో..



నిడదవోలు బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, చిత్రంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్

మా కాంబినేషన్ సూపర్‌హిట్

నిడదవోలు సభతో జగన్ వెన్నులో వణుకు టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-నిడదవోలు

'మా కాంబినేషన్ సూపర్ హిట్, తణుకులో రోడ్‌షో అదిరిపోయింది, నిడదవోలు దద్దరిల్లింది. జగన్‌కు ఇక నిద్ర రాదు, ఇది చూసిన తరువాత గుండె పగిలిపోవడం ఖాయం. మిమ్మల్ని చూస్తుంటే నిర్ణయం జరిగిపోయింది. మే 13న ఇక లాంఛనమే' అని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నిడదవోలు పట్టణంలో దేవీ సెంటర్‌లో గురువారం రాత్రి జరిగిన బహిరంగ సభలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురంధేశ్వరితో కలిసి నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తమను అడ్డుకోవాలని చూస్తే సైకిల్ స్పీడ్ పెంచి తొక్కుకుంటూ పోతామన్నారు. పగలగొట్టాలని చూస్తే గాజు మరింత పదునెక్కుతుందన్నారు. బురద వేయాలని చూస్తే ఆ బురదలోనే కమలం వికసిస్తుందన్నారు. ఈ మూడు కలిస్తే అన్‌స్టాపబుల్ అంటూ సినీ డైలాగులో ఆకట్టుకున్నారు. ఈ కలయికను ఎవరూ ఆపలేరన్నారు. బిజెపితో కలిశామంటూ జగన్ మత రాజకీయాలు చేస్తున్నారన్నారు. తాము వాలంటీర్లకు వ్యతిరేకం కాదని, అలాగని రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోబో మన్నారు. తమ ప్రభుత్వంలోనూ వాలంటీర్లను కొనసాగిస్తామన్నారు. అంతేకాకుండా నెలకు వేతనం రూ.10వేలు చేస్తామన్నారు. ప్రజల్లో నిజమైన హీరో పవన్ కళ్యాణ్ అన్నారన్నారు. మడమ తిప్పని నాయకుడు పవన్‌కళ్యాణ్ అని కొనియాడారు. తొలుత వారాహీ వాహనంపై నుంచి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు కారణంగా కూటమిగా ఏర్పడ్డామన్నారు. పోలవరం గురించి అడిగితే మంత్రులు వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని అన్నారు. వైసిపి అధికారంలోకొచ్చాక ఐదుగురి చేతిలో రాష్ట్రం నలిగిపోతోందన్నారు. ఐదుగురు వ్యక్తులు ఐదు కోట్ల మంది ప్రజలను అణచివేస్తున్నారన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని భావించి పొత్తు పెట్టుకున్నామన్నారు. ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో బూతులు తిట్టే మంత్రులు ఉన్నారన్నారు. ఢిల్లీలో మోదీ నాయకత్వం, ఎపిలో చంద్రబాబు

2లో..

ఎన్నికల విధుల్లో మినహాయింపులు లేవు

కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్నికల విధుల్లో ఎలాంటి మినహాయింపులు ఉండబోవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏడు నియోజక వర్గాల 'ఎఎల్ఎంటి'ల శిక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాస్టర్ ట్రైనీలు అందించే సమగ్ర సమాచారం, దిశా నిర్దేశనం ద్వారా మాత్రమే ఎన్నికల విధుల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సహాయక సిబ్బంది పనితీరు ఆధార పడి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను సమగ్రంగా ఆధ్యయనం చేసుకోవడం, వాటి ఆచరణ అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుందన్నారు. ఇవిఎం, ఇతర పోలింగ్ యూనిట్ల పనితీరు, డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ అనంతరం రిసెప్షన్ కేంద్రంలో కీలకమైన బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల మాస్టర్ ట్రైనర్లను ఒకే వేదికపై తీసుకుని రావడం ద్వారా ఒకరి అభిప్రాయాలు, అనుభవాలు పరస్పరం పంచుకునే వీలుంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం ప్రతి ఒక్కరికీ ఒక జాతీయ భావాన్ని పెంపొందించే ఒక గొప్ప అవకాశం అన్నారు. గత ఎన్నికల్లో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవంతో

2లో..

కార్టూ'నిజం'



దేశ ప్రజల సంక్షేమం కోసమే మేనిఫెస్టో

విలేకరుల సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పల్లంరాజు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

దేశ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ జాతీయ మేనిఫెస్టో రూపొందించిందని కేంద్ర మాజీ మంత్రి, కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లిపూడి మంగపతి పల్లంరాజు అన్నారు. బుధవారం కాకినాడలో ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీ నేషనల్ మేనిఫెస్టో ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ సుదీర్ఘ రాజకీయ చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్న జాతీయ పార్టీ కాంగ్రెస్ అని, ప్రజా సంక్షేమం పేదల జీవన స్థితిగతులను మార్చే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. నూతనంగా విడుదల చేసిన మేనిఫెస్టోలో కిసాన్ న్యాయ్, నారీ న్యాయ్, శ్రామిక న్యాయ్, యువ న్యాయ్, హిస్సేదారి న్యాయ్ మేనిఫెస్టోలో ఉన్నాయన్నారు. పంచన్యాయ్‌లో భాగంగా పచ్చీస్ గ్యారంటీలను ప్రజలకు హామీగా ఇస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న లోక్ సభ, శాసన సభ ఎన్నికల్లో విజయం సాధించడానికి కాంగ్రెస్ పార్టీ న్యాయ్ పత్ర రూపంలో పంచ న్యాయాలలో భాగంగా 25 గ్యారంటీలను ప్రజల ముందు

2లో..

తాగు, సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి - గోకవరం

వేసవి నేపథ్యంలో మండలంలో ఎక్కడా తాగు, సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జడ్‌పి టిసి సభ్యులు దాసరి శ్రీరంగ అధికారులను ఆదేశించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ గోవింద్ ఆధ్వర్యంలో ఎంపిపి సుంకర శ్రీవల్లి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి జడ్‌పిటిసి సభ్యులు శ్రీరంగ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో నీటి ఎద్దడి లేకుండా చూడా లన్నారు. అలాగే ప్రతి గ్రామంలో లైన్‌మేన్ అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలనానరు. వైస్ ఎంపిపి మడికి మైనర్‌బాబు మాట్లాడుతూ తంటికొండ గ్రామంలో నీటి, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎంపిడిఒ గోవింద్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనుల పురోగతి, సమస్యలపై సమావేశానికి మూడు రోజుల ముందుగానే నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రానున్న రోజులు జరగనున్న సర్వసభ్య సమావేశానికి ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధికి కావలసిన మౌలిక సదుపాయాలు మూడు రోజులు ముందుగా నివేదికను మండల పరిషత్ కార్యాలయానికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. పశువుల తాగునీటి కోసం గ్రామాల్లో నీటి తొట్లు అందుబాటులోకి తేవాలన్నారు. ఇప్పటికే నిర్మించిన నీటి తొట్లును శుభ్రం చేయాలన్నారు. ఎన్నికల కోడ్ రీత్యా ఎలాంటి నిధులను విడుదల చేయలేమని సర్పంచులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుంకర వీరబాబు, దాసరి రమేష్, కో-ఆప్షన్ మెంబర్ తోలేటి రాంప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలుస్తా: ఎంఎల్ఎ తలారి

ప్రజాశక్తి - తాళ్లపూడి

బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని గోపాలపురం ఎంఎల్ఎ, కొవ్వూరు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి తలారి వెంకట్రావు హామీ ఇచ్చారు. ఇటీవల వేర్వేరు ఘటనలో మరణించిన తిరువులుమెట్ట గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలను గురువారం ఆయన పరామర్శించారు. కడుపు నొప్పి భరించలేక మృతి చెందిన మహిళ కుటుంబాన్ని, విశాఖపట్నం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాన్ని వెంకట్రావు పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా పూర్తి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ పర్యటనలో ఎఎంసి మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీను, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సింహాద్రి, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, వైసిపి మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, నాయకులు వల్లభ శెట్టి చిన్ని, ఎస్‌సి హెచ్.వెంకటేశ్వరరావు, కె.వీర్రాజు, బి.అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమం: ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెరవలి

వైసిపి ప్రభుత్వ హయాంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేశామని నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలం కాపవరం, కొత్తపల్లి అగ్రహారం, నల్లాకులవారిపాలెం గ్రామాల్లో బుదశారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఎన్నడూ లేని విధంగా గ్రామంలో రూ.7 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. అభివృద్ధిని చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి తదితర ప్రాంతాల్లో సిసి రోడ్డు, కమ్యూనిటీ భవనాలను నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.సీతారాంప్రసాద్, వైస్ ఎంపిపి వేండ్ర శ్రీనివాస్, సర్పంచ్ బంటుమిల్లి రత్నాజీ, పాల వెంకటేశ్వరరావు, కె.ఉదయ భాస్కరరావు, ఎన్.పాలేశ్వరరావు, ఆర్.సూర్యనారాయణ, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పైసా తీసుకోకుండా సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి- రాజానగరం

ఒక్క పైసా తీసుకోకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు అందించామని రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. మండలంలో పుణ్యక్షేత్రంలో వైసిపి నాయకులు, కార్యర్తలతో ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో ఒక్క పైసా తీసుకోకుండా ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందించామన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు వైసిపికి మాత్రమే ఉందన్నారు. టిడిపి ప్రభుత్వంలో గ్రామాల్లో జన్మభూమి కమిటీలు పేదలను దోచుకున్నాయన్నారు. తమ ప్రభుత్వ పాలనలో పథకాలను నేరుగా లబ్ధిదారులకే అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరుకుర్తి వెంకటేశ్వరరావు, కందుల శ్రీనాథ్, పేపకాయల రాంబాబు, కర్రి వీరబాబు, పలివెల రామాంజనేయులు, పేపకాయల ఈశ్వరరావు, లోశెట్టి వీరబాబు, యర్రగాల శ్రీను, యర్రంశెట్టి శ్రీనివాసరావు, ముమ్మిడి దుర్గారావు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి-గోకవరం

గోకవరంలోని జామియా మసీదు, జుమ్మా మసీద్‌ల్లో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ కుటుంబం ఏర్పాటు చేసిన ఈ విందులో ముస్లి ములతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో ఎస్‌విఎస్ అప్పలరాజు, మంగరౌతు రామకృష్ణ, కొత్త కొండబాబు, డాక్టర్ పాలూరి బోసు బాబు, గుండా శివప్రసాద్, మోర్తా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఫ్లెక్సీ ధ్వంసం

ప్రజాశక్తి - రాజానగరం

జనసేన పార్టీ ప్రచార వాహనానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన ఘనటలో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. మండలంలో తూర్పుగోనగూడెం చెందిన పైన దుర్గారావు ఆటోను జనసేన పార్టీ ప్రచారానికి అద్దెకు తీసుకున్నారు. ఈనేపథ్యంలో బుధవారం తెల్లవారు జామున జనసేన పార్టీ ఫ్లెక్సీలను గుర్తు తెలియని ఇద్దరు యువకులు చించేస్తున్నారు. ఆటో డ్రైవర్ భార్య బయటకు వచ్చి చూసే సరికి పరుగులు తీశారు. అటో డ్రైవర్ దుర్గారామ ఇచ్చిన ఫిర్యాదు చేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. తూర్పుగోనగూడెం గ్రామానికి చెందిన వీరమళ్ల జయభువన సాయి, శ్రీరామనగర్‌కు చెందిన యర్రా తేజేషను గుర్తించి కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్ తెలిపారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థినిలను ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-2లోని మహిళా కళాశాలలో చేర్పించాలని ఎంఇఒ-2 డి.శారదాజోత్న్న కోరారు. బుధవారం ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఇఒ-2 జోత్న్న మాట్లాడారు. గత సంవత్సరం తక్కువ మంది విద్యార్థులతో కళాశాల ప్రారంభమైం దన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల మండల అధికారులు పనుల పురోగతిని వివరిం చారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు నందిగం భాస్కర రామయ్య, పరిషత్ సభ్యులు తహశీల్దార్, ఎంపిడిఒ, అధికారులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు 'రచనా రత్న' పురస్కారాలు

ప్రజాశక్తి - కడియం

కడియం శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళాసేవా సమితి ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు అందించారు. ఉగాది వేడుకలు స్థానిక మినర్వా పబ్లిక్ స్కూల్లో మంగళ వారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా సాహితీ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన సామాజిక విశ్లేషకులు మలసాని శ్రీనివాస్ మాట్లాడారు. సాహిత్యం, జర్నలిజం అనేవి ప్రజలను చైతన్య పరుస్తా యన్నారు. కళాసేవా సమితి అధ్యక్షులు అడపా సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు నేతత్వంలో సమాజ అభివృద్ధికి అనేక రచనలు చేస్తున్న కొండ్రెడ్డి శ్రీనివాస్, గొడవర్తి శ్రీనివాస్, గొల్లపల్లి సత్యనారాయణలను రచనారత్న పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాసేవాసమితి ప్రతినిధులు దేవవరపు నీలకంఠ రావు, తోరాటి వసంతరావు, మినర్వా వెంకటేశ్వరరావు, తమ్మిశెట్టి ప్రసాద్, ఉంగరాల వీరభద్రరావు, తోకల శ్రీనివాస్ ఎపిడబ్ల్యూజెయు రాష్ట్ర కార్యదర్శి మండేల శ్రీరామ్మూర్తి, ఎంఇఒ వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నివారణకు చర్యలు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురంలో కోతుల బెడదను అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఉన్న కోతులను పట్టుకునేందుకు జల్లెడ పడుతున్నారు. ఇటీవల ఒక విద్యార్థిపై కోతులు మూకుమ్మడిగా దాడి చేయగా మొదటి అంతస్తు నుంచి కింద పడిపోయి తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. దీనిపై ప్రజాశక్తి దినపత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనికి అధికారులు స్పందించారు. కోతులను పట్టుకునేందుకు రంగం సిద్ధం చేశారు. బుధవారం గోపాలపురం పరిసర ప్రాంతంలో ఉన్న సుమారు 30 కోతులను పట్టుకున్నామని పంచాయతీ కార్యదర్శి ఎస్.చిన్నవెంకాయమ్మ, సర్పంచ్ పైడి శిరీష తెలిపారు. వాటిని అడవిలో విడిచి పెడతామని తెలిపారు.



రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని దొండపూడిలో రంజాన్ పండుగను పురస్కరించుకొని 110 కుటుంబాలకు రంజాన్ తోఫా అందించామని టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు ముత్యాలరాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టిడిపి నియోజకవర్గ మహిళా అధ్యక్షులు కాకర్ల రామతులసి, ముత్యాల రాయుడు ఆధ్వర్యంలో తోఫా అందించారన్నారు. టిడిపి ప్రభుత్వంలో అన్ని పండుగలకు చంద్రన్న కానుక సరుకులు అందించేవారన్నారు. వైసిపి ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. రేషన్ సరుకుల్లో సైతం కోతలు విధించిందన్నారు. కేవలం బియ్యం, పంచదారకు మాత్రమే పరిమితం అయ్యారన్నారు. అభివద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్య క్రమంలో సీనియర్ నాయకులు బండారు గన్నిరాజు, పంది సోమరాజు, మద్దాల సన్నారియ్య, షేక్ బద్రి, కడియం శ్రీను, పిల్లి కృష్ణ, వెల్లంకి జయశివసూర్యం, ముప్పిడి అనిల్ కుమార్, రౌతు సతీష్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి -దేవరపల్లి రూరల్

గోపాలపురం నియోజకవర్గ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి, హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత ఆధ్వర్యంలో పలువురు వైసిపిలో చేరారు. మండలంలోని దుద్దుకూరులో రెడ్డి బాబు, నిమ్మగడ్డ కృష్ణ ఆధ్వర్యంలో 37 కుటుంబాలు వైసపిలో చేరాయి. యర్నగూడెం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరందుకున్న ప్రచారం

(మొదటి పేజీ నుంచి)

కోలేకపోతున్నారు. 30 శాతం కూడా ఇళ్ళు 5 ఏళ్ల పాలనలో పూర్తికాలేదు. రూ.వేలకోట్లతో స్మార్ట్ సిటీని అభివద్ధి చేశామని చెబుతున్నప్పటికీ నేటికీ ముంపు సమస్య నగరవాసులను ఇబ్బందులకు గురి చేస్తూనే ఉంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు మోకాలి లోతు నీరు నిలిచిపోతుంది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతోనే ఈ దుస్థితి నెలకొంది. అవుట్ లెట్ సౌకర్యం కల్పించకపోవడంతో ఏటా ముంపు సమస్య నగరవాసులకు నరకం చూపిస్తోంది. అయినా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారులు మరమ్మతులు గురై ఐదేళ్లుగా ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. ఇలా పలు సమస్యలతో తీవ్రంగా ప్రజలు సతమతమవుతున్నా అభ్యర్థులు వాటి ఊసే ఎత్తడం లేదు.కేవలం ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నాలు మాత్రం జోరుగా సాగిస్తున్నారు.

దేశ ప్రజల సంక్షేమం కోసమే మేనిఫెస్టో

(మొదటి పేజీ నుంచి)

ముందు పెడుతున్నామన్నారు. ఈ సందర్భంగా పంచ న్యాయ అంశాలను ఆయన వివరించారు. యువతకు ఉపాధి, రైతుకు సంరక్షణ, మహిళలకు సంపూర్ణ న్యాయం, తదితర అంశాలపై ఆయన వివరించారు రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల అభ్యర్థులను అభినందిం చారు. దేశ భవిష్యత్తు రాష్ట్ర ప్రయోజనాలను దష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పార్టీని ఆదరించి మళ్లీ గెలిపించాలని కోరారు.

ఎన్నికల విధుల్లో మినహాయింపులు లేవు

(మొదటి పేజీ నుంచి)

ఈ ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ రూపొందించిన పిఒ డైరీ, ఇతర అనుబంధ సర్క్యులర్లను, ముఖ్యమైన మార్గదర్శకాలను ఇప్పటికే అందించా మన్నారు. ఇవిఎంలు, వివిప్యాట్‌లు ఎటువంటి పరిస్థితుల్లో మార్పు చేయాలి, అందుకు అనుసరించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. పోలింగ్ ముందు రోజున, పోలింగ్ రోజున చేయాల్సిన పనులపై కలెక్టర్ దిశా నిర్దేశనం చేశారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోస్టల్ బ్యాలెట్‌ల కోసం ఫారం 12ను పోస్టింగ్ ఉత్తర్వులతో జత చేసి పంపించామన్నారు. ఎన్నికల సిబ్బందికి ఏప్రిల్ 15న తొలి శిక్షణ ఉంటుందన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఫేసిలిటేషన్ సెంటర్ వద్ద 10 టేబుల్స్ ఏర్పాటు చేసి, ల్యాప్‌టాప్‌లతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్‌లను కేటాయించామన్నారు. వారి వద్ద డ్యూటీ ఉత్తర్వులు, ఫారం-12, ఎపిక్ కార్డు తీసుకుని ఓటును నిర్ధారణ చేసుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారులు వద్ద ఖాళీ ఫారం 12 అందుబాటులో ఉంచామని, ఏవైనా తప్పులు దొర్లితే అక్కడికక్కడే సరిచేసే వెసులుబాటు ఉందని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర సమాచారాన్ని అందచేశారు. ఈ సమావేశంలో ఆర్‌ఒలు ఎన్.తేజ్‌భరత్, కె.దినేష్‌కుమార్, అశుతోష్ శ్రీవాత్సవ్, డిఆర్‌ఒ జి.నరసింహులు, ఎ.చైత్రవర్షిణి, కెఎల్.శివజ్యోతి, ఎమ్.మాధురి, ఆర్‌వి.రమణానాయక్, రాజమండ్రి పార్లమెంటు సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్‌డిసి ఆర్.కృష్ణనాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భానుప్రకాష్, పి.సువర్ణ, ఎఎల్ఎంటి మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

మా కాంబినేషన్ సూపర్‌హిట్

(మొదటి పేజీ నుంచి)

అనుభవం, ఐదేళ్లుగా దాడులను తట్టుకుని నిలబడిన జనసైనికులు ఈ రాష్ట్రానికి అవసరమన్నారు. నిడదవోలు నుంచి ఈసారి జనసేన పార్టీ బరిలో ఉందని, కందుల దుర్గేష్ పోటీ చేస్తున్నారని, ఆయన్ని గెలిపించాలని కోరారు. సొంత చెల్లెళ్లకే గౌరవం ఇవ్వని వ్యక్తికి సగటు ఆడపిల్లలు ఓ లెక్కా? అన్నారు. మూడువేల మంది ఆడబిడ్డలు ఆచూకీ లేకుండా పోతే, కనీసం స్పందించలేదన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టిలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దళిత డ్రైవర్‌ను హత్యచేసి డోర్‌డెలివరీ చేసిన ఎంఎల్‌సి అనంతబాబును వెంటబెట్టుకు తిరిగే పరిస్థితి వైసిపిలో ఉందన్నారు. బాధిత కుటుంబానికి నేటికీ న్యాయం జరుగలేదన్నారు. తుపానులను మించిన వైపరీత్యం ఈ వైసీపీ పాలన అన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రం కుదేలైందన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. అభివృద్ధి అనే పదానికి తావు లేకుండా పోయిందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో నాణ్యత లేని మద్యాన్ని పేదలతో తాగించి, మహిళల పుస్తెలు తెగినా ఫర్వాలేదు, మా జేబులు నిండితే చాలు అనే పరిస్థితులను వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. బిసి కమిషన్‌కు చట్టబద్ధత ఇవ్వకుండా బిసిలకు ఎలా న్యాయం చేస్తారని వైసిపిని ప్రశ్నించారు. డోర్ డెలివరీ చేస్తే ఆ కుటుంబానికి ఇప్పటివరకు న్యాయం జరగలేదని పురందేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే కచ్చితంగా మార్పు అవసరం ఉందని అన్నారు. ఈ సభలో నిడదవోలు నియోజకవర్గ జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. హైవే పోలీసులు తెలిపిన ప్రకారం..రామవరం గ్రామానికి చెందిన ఎద్దుమాటి దేవి తన భర్త వీరబాబు(32)తో కలిసి కల్లు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దీనిలో భాగంగానే వ్యాపారం ముగించుకుని రామవారం గ్రామంలో హైవే రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియనీ బైక్ బలంగా ఢీకొనడంతో వీరబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం


గోవిందరాజు(ఫైల్)

ద్రాక్షారామ జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇంగ్లిషుఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న అద్దంకి గోవిందరాజు(55) బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దీనితో ఆయన స్వగ్రామైన ఎర్ర పోతవరంలో విషాదఛాయలు అలుము కున్నాయి. ఎంతో సౌమ్యుడు గా పేరుందిన గోవిందరాజు మృతి పట్ల ఎంఇఒ మీనపూడి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు పద్మావతి, హసన్‌బాద ప్రధానోపాధ్యాయులు పిఎస్పీఎస్కే సుందరి, ఉపాధ్యాయులు విటల్, పలువురు ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-అమలాపురం

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని దళితసేన ఆధ్వర్యంలో బుద్ధ మెమోరియల్ బ్లడ్ బ్యాంక్ నందు బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కోనసీమ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారెం రవితేజ, విజయ మెడికల్ సెంటర్ అధినేత డాక్టర్.అంబేద్కర్ రతన్ బెనర్జీ తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. 25 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో దళిత సేన అధ్యక్షుడు మెండి డేవిడ్ అంబేద్కర్, పినిపే రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో రెండు హెలీప్యాడ్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్ నందు గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు, సాయంత్రం అమలాపురం గడియారం సెంటర్ నందు జరిగే ప్రజాగళం బహిరంగ సభకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు , జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లు విచ్చేయుచున్నారు.ఈ సందర్భంగా స్థానిక హైస్కూల్ ఆవరణలో వేరు వేరుగా రెండు హెలీప్యాడ్‌ల ఏర్పాట్ల ను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జెడ్‌పి సిఇఒ ఎ.శ్రీరామచంద్రమూర్తి బుధవారం పరిశీలించారు.

వైసిపి నియోజకవర్గ సమావేశం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని పార్టీ కార్యాలయం ఆవరణలో బుధవారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముమ్మిడివరం అసెంబ్లీ వైసిపి అభ్యర్థి, ఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్ కుమార్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు వైసిపి గెలుపే ధ్యేయంగా పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ వారి ఛాంబర్ నందు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్ష శుక్లా ఎన్నికల ప్రక్రియలో పురోగతిపై సమీక్షల నిర్వహించారు బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్లు దాఖలు చేసే ప్రక్రియ లో చేపట్టాల్సిన మెలకువలను జాగ్రత్తలను ఆయన రాజకీయ ప్రతిని ధులకు వివరించారు. జిల్లాలో ఈ నెల 12న శుక్రవారం ఎల క్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, పోలింగ్ సిబ్బందితో ముమ్మి డివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల నందు రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామని ఈ ప్రక్రియలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వామ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ టి.వైద్యనాథ శర్మ, సిబ్బంది రవిశంకర్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున కామన ప్రభాకర్ రావు, బిజెపి తరపున దూరి రాజేష్, వైసిపి తరపున సంసాన్ నాని, బిఎస్‌పి తరపున కాశీ లక్ష్మీ భవాని, సిపిఎం తరపున కారెం వెంకటేశ్వ రరావు తదితరులు పాల్గొన్నారు .

సి-విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులపై చర్యలు

త్వరలో నిర్వహించనున్న పార్లమెంట్ అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి డాక్టర్ బిఆర్ .అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై సి విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు ఈ విధంగా ఉన్నాయని సిపిఒ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సి-విజిల్ యాప్ ద్వారా పౌరులు ఎన్నికల ప్రవర్తన నియ మావళి ఉల్లంఘన పై అందిన ఫిర్యాదులు రోజువారి నివేదిక ప్రకారం ఈ నెల 9వ తేదీన 16 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమాలు ఉల్లంఘనలపై వచ్చాయన్నారు వాటిలో మూడు ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించినవి కావన్నారు. ధ్రువీకరించి మిగిలిన13 ఫిర్యాదులను పరిష్కరించామని సిపిఒ వెంకటేశ్వర్లు తెలిపారు. సి-విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 364 ఫిర్యాదులు రాగా వాటిలో 80 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించినవి కానివని ధ్రువీకరించామన్నారు. మిగిలిన 284 ఫిర్యాదుల్లో 100 నిమిషాల్లోపు 250 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. 34 ఫిర్యాదులను వంద నిమిషాలు పైబడిన తర్వాత పరిష్కరించామన్నాయరు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వారి ద్వారా జిల్లాకు సంబంధించి గత నెల 16వ తేదీ నుండి ఈ నెల 9వ తేదీ వరకు 27 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పై వచ్చాయని, వీటన్నిటిని సకాలంలో పరిష్కరించామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

ఎన్నికల నిబంధనలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

ఆలమూరు సార్వత్రిక ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు కావాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం సాయంత్రం మండల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కాన్ఫరెన్స్లో సుమారు రెండు గంటల పాటు ఎన్నికల నియమావళిపై వారికి కలెక్టర్ వివరించడం జరిగింది. దీనిపై తహశీల్దార్ డివిఎన్.అనిల్ కుమార్, మండల పరిషత్ ఎఒ రామ్ స్వరూప్‌లు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఫ్లెక్సీలు, కటౌట్లు, డిజిటల్ బోర్డులు వంటి వాటిపై తీసుకోవలసిన చర్యలను వివరించారన్నారు. పై వాటిపై ఫిర్యాదులు రాకుండా తగు జాగ్రత్తలు తీసు కోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు వారు తెలిపారు. టీం వర్క్ నిత్యం జరగాలని ర్యాండమ్ చెకింగ్ తప్పక అనుసరించాలన్నారని వారు తెలిపారు. నామినేషన్ల పర్వం దగ్గర పడుతున్న నేపథ్యంలో అనుసరించవలసిన విధివిధానాలు చర్చించడం జరిగిందన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-ఆత్రేయపురం



రైతుకూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భవాని అన్నారు. బుధవారం ఆత్రేయపురం గ్రామంలో, ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లను చైతన్యవంతం చేశారు, సదరు కార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు, లారీ డ్రయివర్లు, గ్రామ రెవెన్యూ అధికారి, మరియు ఇతర రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

నెక్కంటిని కలిసిన సుభాష్

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం రూరల్

కపిలేశ్వరపురం మండల పరిధి అంగర గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, విజయనగరం జోనల్ ఆర్‌టిసి మాజీ చైర్మన్ నెక్కంటి బాలకష్ణను రామచంద్రాపురం టిడిపి కూటమి ఎంఎల్‌ఎ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ బుధవారం అంగరలో ఆయన స్వగహంలో కలిశారు. ఈ సందర్భంగా సమీప నియోజకవర్గమైన రామచంద్రపురంలో ఎంఎల్‌ఎగా పోటీ చేయుచున్న తనకు పూర్తి సహాయ సహకారాలను అందించి విజయానికి తోడ్పడాలని బాలకష్ణను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ముందు వరసలో ఉంటుందని బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బళ్ల గేటు సెంటర్ లో ఏర్పాటు చేసిన బ్యాంకు నూతన కార్యాలయాన్ని శ్రీనివాస్ బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ప్రభత్వ రంగానికి చెందినదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూనియన్ బ్యాంక్ ల ఆధ్వర్యం లో పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో 8 జిల్లాలో 267 శాఖలతో పనిచేస్తోందన్నారు. నేడు అంబేద్కర్ కోనసీమ జిల్లా లో రెండు శాఖల ద్వారా సేవలను అందిస్తుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం మార్చి 2024 నాటికి రూ.10.28 కోట్లు డిపాజిట్లు సేకరించడమే కాకుండా, రుణాలుగా రూ.12500 కోట్లు(అప్పులు) వ్యాపార నిమిత్తం ఇచ్చిన ఘనత తమ శాఖదేనన్నారు. నేటికీ రూ.22,528 కోట్లు వ్యాపారంతో నడుస్తుందని వివరించారు. అంతేకాకుండా బ్యాంక్ డిపాజిట్లు పై అత్యధిక వడ్డీ ఇస్తున్న ప్రభుత్వరంగ బ్యాంకుగా 8.6 శాతం సీనియర్ సిటిజన్స్ కు చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వరంగ బ్యాంక్ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అన్నారు.దీని ద్వారా రైతులకు స్వల్ప వడ్డీ రేటు కు పంట రుణాలు, బంగారు ఆభరణాల పై ప్రతి రోజు గ్రాముకు అధిక మొత్తం లో రుణాలు మంజూరు చేయడమే కాకుండా, రైతులకు పంటపొలాలు కొనుగోలు నిమిత్తం ఋణ సౌకర్యం, గృహ నిర్మాణానికి, కొనుగోలుకు, గృహ మరమ్మతులతో పాటు విద్యారుణం, నివాసగృహాలు మరియు ఇంటి స్థలాల పైన రుణ సదుపాయం మరియు వ్యక్తిగత రుణ సదుపాయాలు అందిస్తుందన్నారు. బ్యాంక్ కాల్ సెంటర్ నెంబర్.18004256708 కు ఫోన్ చేసి బ్యాంక్ పథకాల కొరకు తెలుసు కోవచ్చునన్నారు. త్వరలో రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో మరో 5 శాఖలను ప్రారంభించనున్నట్లు బ్యాంక్ నియమిత రీజియన్ మేనేజర్ డి పాపయ్య పేర్కొన్నారు. ఇప్పటికే రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో 65 శాఖలతో రూ.2070 కోట్లు, డిపాజిట్లు సేకరించడం తో పాటు, రుణాలు(అప్పులు) రూ.2220 కోట్లు ఇచ్చిన ఘనత సాధించడమే కాకుండా మొత్తం వ్యాపారం రూ.4290 కోట్లు అన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ కార్యాలయం ప్రణా ళికా అధికారి రామా రెడ్డి ప్రాంతీయ కార్యాలయం క్రెడిట్ అధికారి రత్నకుమార ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది శాఖా అధికారి, ఖాతాదారులు పాల్గొన్నారు.


నూతన శాఖ ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్ శ్రీనివాస్

కోడ్ కష్టాలు

- శుభకార్యాల సామగ్రి కొనుగోలుకు ఇక్కట్లు
- క్షేత్రస్థాయిలో అమలు కాని సడలింపులు
- నగదు తీసుకెళుతుంటే తనిఖీల బెడద

ప్రజాశక్తి-రాజోలు

ఎన్నికల నియమావళి రాకతో శుభకార్యాల నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వివిధ రకాల కొనుగోళ్లకు పట్టణాలకు వస్తుంటారు. ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్ కావడంతో రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నగదు లావాదేవీలకు కష్టకాలం వచ్చింది. వస్తువుల కొనుగోలుతోపాటు ఫంక్షన్ హాళ్ల బుకింగ్, బంగారం, వస్త్రాల కొనుగోలుకు తిప్పలు తప్పడం లేదు. సారె వస్తువులు, గృహోపకరణాలు కొనుగోలుకు నగదు తీసుకురావడానికి భయపడుతున్నారు. ఏప్రిల్‌లో ఎక్కువగా వివాహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పెళ్లి సామగ్రిని సమకూర్చుకోవడానికి నిర్వాహకులు అష్టకష్టాలు పడుతున్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తనిఖీల బెడద

శుభ కార్యాల సీజను. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు వంటి వాటికి ముహూర్తాలు అధికంగా వున్నాయి. దీంతో కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు కళకళలాడుతున్నాయి. అయితే శుభకార్యాలు తలపెట్టుకున్న వారికి సార్వత్రిక ఎన్నికలు చుక్కలు చూపిస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. దానితో పాటే జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులు వెలిశాయి. వాటితో పాటు ఎక్కడపడితే అక్కడ వాహనాల తనిఖీలు జరుగుతున్నాయి. బంగారం, వస్త్రాలు, ఫర్నీచర్ వంటి వాటి కొనుగోలుకు నగదు వెంట తీసుకెళుతుంటే తనిఖీలలో భాగంగా స్వాధీనం చేసుకుంటున్నారు. నగల కొనుగోలు సంగతేమో కానీ ఆ నగదు వెనక్కు తీసుకోవడానికి శుభకార్యాల నిర్వాహకుల తలప్రాణం తోకకొస్తోంది. ఇలాంటి వాటికి సడలింపులున్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అవేవీ అమలు కావడం లేదు. దీంతో ఎన్నికల సంగతి తెలియక శుభకార్యాలు పెట్టుకున్నామంటూ బాధితులు వాపోతున్నారు. జిల్లాలో శుభ ముహూర్తాలు వుండడంతో ఈ సీజనులో పెళ్ళిళ్ళు అధికంగా పెట్టుకుంటున్నారు. ఈ నెల 18, 19, 20, 21, 24, 26, 27 తేదీల్లో వివాహాలకు శుభ ఘడియలు వున్నాయి. జిల్లా అంతటా పెద్దసంఖ్యలో పెళ్ళిళ్ళు వున్నాయి. ఈనెల 27 నుంచి మూడు నెలల వరకు శుభ కార్యాలకు మూఢం అడ్డు వస్తోంది. దీంతో ఆ లోపే గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, చిన్నారులకు నామకరణం వంటి కార్యక్రమాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో శుభ కార్యాలకు కానుకలు ఇచ్చే అలవాటు బాగా పెరిగింది. ఇక పెళ్ళంటే అన్నింటికీ ముందుగానే మాట్లాడుకుని అడ్వాన్సులు కట్టాలి. అమ్మాయిల తల్లిదండ్రుల్లో ఎక్కువమంది కొత్త ఫర్నిచర్ కూడా కొనుగోలు చేస్తుంటారు. ఇందులో ఒకటి రెండు మినహా మిగిలిన వాటికి రూ. లక్షల్లోనే చెల్లింపులు. దీంతో ఇంటి నుంచీ బయలు దేరితే జేబులో రూ.లక్షలు వుండాల్సిందే. సాధారణ రోజుల్లో నగదు వెంట తీసుకుని ప్రయాణించడం ఇబ్బందేమీ కాదు కానీ ఇపుడు సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి.

బంగారం కొనాలన్నా అవస్థలే

గత నెల 16న ఎన్నికల షెడ్యూలు వెలువడింది. అదే రోజు నుంచీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కనీసం ఐదు తులాల బంగారం కొనాలన్నా రూ. 3 లక్షల పైనే అవుతోంది. కొత్త బట్టలూ రూ.లక్షల్లోనే. చెక్‌పోస్టుల్లో, మార్గమధ్యంలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు రూ.50 వేలకు మించి నగదు దొరికితే సీజ్ చేస్తున్నారు. యక్ష ప్రశ్నలు వేస్తున్నారు. పోలీసు స్టేషన్‌కు పోవడంతో పాటు నగదుకు ఆధారాలు చూపి వెనక్కు తీసుకునేసరికి చుక్కలు కనిపిస్తున్నాయి. కొందరు ఆధునిక టెక్నాలజీ సాయంతో మొబైల్ నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపులు జరుపుతున్నా ఎక్కువమంది నగదు చెల్లింపులే చేస్తున్నారు. శుభమా అని శుభకార్యాలు పెట్టుకుని కొనుగోళ్ళకు బయల్దేరితే తీరా పోలీసు స్టేషన్లకు చేరాల్సి వస్తోంది. ఇది వారిని తీవ్ర వేదనకు గురి చేస్తోంది.

నిబంధనల్లో స్పష్టత ఏదీ?

చట్ట ప్రకారం రూ.50 వేలు మించి నగదు చెల్లింపులకు పాన్ కార్డు వుండాలి. తనిఖీల్లో రూ. 50 వేలకు మించి నగదు వుంటే లెక్కలు చెప్పాలని అధికారులు చెబుతున్నారు. మళ్ళీ అదే అధికారులు రూ.10 లక్షలకు మించి పట్టుబడితే ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి అప్పగిస్తామంటున్నారు. మరోవైపు రూ.5 లక్షల వరకూ ఐర్వాలేదని, అది దాటితే లెక్కలు, ఆధారాలూ చూపాలని వారే చెబుతున్నారు. దీనిపై స్పష్టత లేకపోవడంతో పాటు క్షేత్రస్థాయిలో పోలీసులు రూ. 50 వేలు పైబడి నగదు దొరికితే చాలు స్టేషన్లకు తీసుకెళుతున్నారు. ఆ నగదు వాపస్ తీసుకోవడానికి బాధితులకు రోజులు పడుతోంది. పెళ్ళి పత్రిక చూపిస్తే వదిలేస్తామని అధికారులు చెబుతున్నా చాలావరకూ పెళ్ళి ముహూర్తానికి పదిహేను రోజుల ముందు మాత్రమే పత్రికలు ముద్రించే పరిస్థితి వుంది. కానీ నగలు, బట్టలు మాత్రం చాలా ముందుగానే కొనుగోలు చేస్తారు. దీంతో అందరూ పెళ్ళి పత్రికలు చేతపట్టుకుని నగదుతో ప్రయాణించాలంటే వీలు కాదు. నిజానికి ఎన్నికల్లో ఓటర్లకు నగదు పంపిణీ పోలింగ్‌కు ఒకటి రెండు రోజులు ముందు మాత్రమే జరగడం ఆనవాయితీ. నోటిఫికేషన్ వెలువడ్డాక కఠినంగా ఆంక్షలు అమలు చేసినా పర్వాలేదు కానీ షెడ్యూలు నుంచే సుమారు రెండు నెలల పాటు సామాన్య జనాన్ని, అవసరార్థం నగదుతో వెళుతున్న వారిని తనిఖీల పేరిట వేధించడం విమర్శలకు దారి తీస్తోంది. భారీ మొత్తాలు దొరికితే చట్ట ప్రకారం వ్యవహరించడం తప్పదు. కానీ రూ. 5 లక్షల లోపు స్వల్ప మొత్తాలకు నోటిఫికేషన్ కంటే ముందు నుంచీ ఆంక్షలు విధించడం సరికాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

రైతులకు, సామాన్యులకు ఇబ్బంది లేదు



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు వున్నప్పటికీ రైతులు, సామాన్యుల విషయంలో ఇబ్బందులూ కలిగించడం లేదు. నగదుతో ప్రయాణించే వారు తగిన పత్రాలు వెంట ఉంచుకోవాలి. ఉదా హరణకు బ్యాంకు నుంచీ నగదు డ్రా చేసిన రశీదులు, లేదా పాస్ బుక్ వుండాలి. రూ. 5 లక్షల వరకూ నగదు వున్నా సామాన్యులు, రైతుల విష యంలో ఇబ్బంది వుండదు. శుభ కార్యాలకు సంబంధించి కూడా ఇదే వర్తిస్తుంది. హోల్‌సేల్ వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు, బంగారు నగర వర్తకులు వంటి వారిపై ఎక్కువగా దృష్టి పెడతాం. ఏ స్థాయిలో నగదు పట్టుబడినా తగిన లెక్కలు, ఆధారాలు చూపితే సమస్య లేదు.


-ఆర్.గోవిందరాజు, సిఐ,రాజోలు


కార్యక్రమంలో పాల్గొన్న గొల్లపల్లి తదితరులు

మలికిపురంలో వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- రాజోలు

మలికిపురంలో వైసిపి కార్యాలయాన్ని వైసిపి రాజోలు ఎంఎల్ఎ అభ్యర్థి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సింగిల్‌గానే పోటీ చేస్తున్నారని తెలిపారు. అయితే ఆయన్ను తట్టుకునే ధైర్యం లేక టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని అన్నారు. ఎన్ని కూటములు కలిసి పోటీచేసినా జగనన్న గెలుపు ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజోలు జెడ్‌పిటిసి సభ్యురాలు మట్టా శైలజా, కెఎస్ఎన్. రాజు, రాష్ట్ర జనరల్ సెక్రేటరి తెన్నేటి కిషోర్, పాటి శివకుమార్, సూరిశెట్టి బాబీ,నక్కా రామారావు, రేవు జ్యోతి, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.


పోతవరంలో ప్రజలతో మాట్లాడుతున్న వైసిపి అభ్యర్థి విప్పర్తి

పలు గ్రామాల్లో 'విప్పర్తి ' ప్రచారం

ప్రజాశక్తి-మామిడికుదురు

పి.గన్నవరం మండలంలో పోతవరం, బెల్లంపూడి, వైవి.పాలెం, గ్రామాల్లో పి.గన్నవరం వైసిపి అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి కాలనీకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అభివృద్ధి గురించి వివరించారు. కుల,మత రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పోతవరం సర్పంచ్ వడలి కొండయ్య, ఎంపిపి డి.వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్ పర్సన్ డిసత్యమోహన్, బెల్లంపూడి సర్పంచ్ బండి మహాలక్ష్మి, మండల అద్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, గుత్తుల దాసు, అడ్డగళ్ళ సాయిరాం, వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో దళిత నేతల సమావేశం

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజకవర్గం నుంచి పలువురు దళిత నాయకులు మంగళగిరి టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబుతో సమావేశమయ్యారు. మాలల సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రగతికి సహకరించాలని, మాలల మద్దతు టిడిపికి ఉంటుందని మాల మహానాడు నాయకులు ఈ సందర్భంగా తెలియజేశామని ప్రజాశక్తికి వివరించారు. చంద్రబాబుతో సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు మాట్లాడుతూస్వతంత్ర్య భారతదేశంలో మాలలకు ఎన్నడూ జరగని నష్టం జగన్ పాలనలో జరిందన్నారు. 27 కు పైగా సంక్షేమ పథకాలు రద్దు చేసి మాలలను అభివృద్ధికి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్‌లో మాలల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామన్నారు. సమావేశంలో మాల మహానాడు నేతలు గోళ్ల అరుణ్ కుమార్, గుజ్జర్లపూడి చారువక, మల్లెల వెంకట్రావు, అన్నవరపు కిశోర్, అలగా రవికుమార్, గోగులమూడి రాము, యనమల రాజ్ కుమార్, బేతల శరత్ బాబు, వాసుమల్లి జాన్ మార్కు, రవ్వా భూషణం తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాగళం' సభ విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

అమలాపురంలో గురువారం సాయంత్రం టిడిపి అధినేత చంద్రబాబు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిర్వహించే ప్రజాగళం సభను విజయవంతం చేయాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. గొల్లవిల్లిలో బుధవారం టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆనందరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుండి వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.సమావేశంలో టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు లంకే భీమరాజు, గుత్తుల నాగేశ్వరరావు,అడబాల సత్యనారాయణ, గొలకోటి చిన్న, నిమ్మకాయల చెల్లయ్య నాయుడు, గనిశెట్టి అరవింద్, గొలకోటి సత్తిరాజు, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


గొల్లవిల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరావు

ముమ్మిడివరం సాధారణ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జన సేన అధ్యక్షుడు పవన కళ్యాణ్ లు అమలాపురంలో పాల్గొనే బహిరంగ సభలను జయప్రదం చేయాలని ఉమ్మడి పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర్ పంచాయతీ పరిధిలోని స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం 1మరియు 2 క్లస్టర్ ల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు అర్థాని శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగింది. తొలుత కొత్తలంక గ్రామ కమిటీ అధ్యక్షుడుగా పని చేసిన దాసరి నాగేశ్వరరావు మృతికి 2 నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపింది. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ గురువారం సాయంత్రం అమలాపురంలో జరిగే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గొలకోటి దొరబాబు, చిక్కాల అంజిబాబు, దొమ్మేటి రమణ కుమార్, యాళ్ల ఉదయ్, దంగేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి ' దాట్ల' ప్రచారం

ప్రజాశక్తి-కాట్రేనికోన


ఎన్నికల ప్రచారం చేస్తున్న దాట్ల సుబ్బరాజు

మండల పరిధిలోని గెద్దనాపల్లి, కొప్పు గుంట గ్రామాల్లో బుధ వారం ముమ్మిడివరం అసె ంబ్లీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి దాట్ల సుబ్బ రాజు (బుచ్చిబాబు) బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుబ్బరాజుకు గ్రామంలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆయన ఇంటింటా వెళ్లి ఓటును అభ్యర్థించారు. తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి తనను అఖండ మెజార్టీతో గెలిపిం చాలని సుబ్బరాజు ప్రజలను అభ్యర్థించారు. సుబ్బరాజు మాట్లాడుతూ అయిదేళ్ల వైసిపి పాలనలో శివారు ప్రాంతాలన్నీ అభివృద్ధికి ఆమడ దూరంలోనే నిలిచాయని అన్నారు. గ్రామాల్లో కనీస మౌలిక సదు పాయాలు కల్పించలేక ప్రజలు ఇబ్బందులను గాలి కొదిలిం దన్నారు. స్థానిక శాసన సభ్యుడు ప్రజలకు చేసిందేమీ లేదని, శివారు ప్రాంతాల్లో అయిదేళ్ల పాటు కనీస అభివృద్ధి చేయ లేకపోయా రన్నారు. ఇప్పుడు ప్రజలను మరోసారి మభ్య పెట్టేందుకు వస్తున్నారని విమర్శించారు. కార్యక్రమం లో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, మండల పార్టీ అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు, నాగిడి నాగేశ్వర రావు, సర్పంచ్‌లు సీతా రామరాజు, చెల్లి సురేష్, దాట్ల పవన్, వనచర్ల నాగేశ్వ రరావు తదితరులు పాల్గొన్నారు .

12న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాజులూరు

విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అవాంతరాలను నివారించేందుకు ఈ నెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ జి.ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ 33/11 కెవి గొల్లపాలెం సబ్‌స్టేషన్‌లో 11 కెవి ఇండస్ట్రియల్ పరిధిలో గల అన్ని పరిశ్రమలు, ఆక్వా ప్రాంతాలతోపాటు, ఆర్యవటం 11 కెవి సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలోని గొల్లపాలెం, ఆర్యావటం, 11కెవి శీల ఫీడర్ పరిధిలోని శీల, మొగలిపాలెం, శలపాక, తణుకువాడా, మంజేరు, శీల్లంక, ఒంటితాడి, బొడ్డువాని లంక, 33 కెవి కాజూలూరు పరిధిలో 33 కెవి కోస్టల్ ఆక్వా, కాజులూరు, ఐతపూడి, తిప్పరాజుపాలెం, 11 కెవి ఇండస్ట్రియల్ పరిధిలో గల అన్ని పరిశ్రమలు, ఆక్వా ప్రాంతాల్లోని ట్రీ ట్రిమ్మింగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

కొత్త ప్రతిపాదనలను రూపొందించాలి

ప్రజాశక్తి - కాకినాడ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

జిల్లాలో ఉపాధి హామీ పనులకు సంబంధించి కొత్త ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు ఇది మంచి సీజన్ కనుక నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా కూలీల సంఖ్యను పెంచి, పనులు ఎక్కువగా చేపట్టాలన్నారు. మండల స్థాయిలో కొత్త పనులు గుర్తించాలన్నారు. ఇందుకు తహశీల్దార్, ఎంపిడిఒ, సర్వే, ఎపిఒలు బృందంగా ఏర్పడి సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రధానంగా ఫారం పాండ్, అమృత్ సర్వోవర్, రూఫ్ వాటర్ హార్వే స్టింగ్ స్ట్రక్చర్ వంటి పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పంచాయతీలు, మున్సిపాలిటీలలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. క్రమంగా మంచినీరు ట్యాంకులకు క్లోరినేషన్ ప్రక్రియ చేయించాలన్నారు. తాగు నీటి నమోనాలు సేకరించి, ప్రతి వారం పరీక్షలు నిర్వహించాలన్నారు. వాటి వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్ పనులలో భాగంగా పూర్తైన ఆరు పనులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడం జరిగిందని వెంటనే వీటిని వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ నెల 12 నుంచి జరిగే నియోజకవర్గస్థాయి శిక్షణ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. మండల స్థాయి అధికారులు ఎన్నికల మార్గదర్శకాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎంసిసి కేసుల నమోదుపై దృష్టి సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, హౌసింగ్ పీడీ ఎఎన్‌వి.సత్యనారాయణ, డిపిఒ కె.భారతి సౌజన్య, డిఇఒ పి.రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎం.శ్రీనివాసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


రత్నగిరిపై కళ్యాణోత్సవాల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఇఒ

కళ్యాణోత్సవంపై ఇఒ సమీక్ష

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి వార్షిక కళ్యాణోత్సవం ఏర్పాట్లు దేవస్థానం ఇఒ ఎ.రామచంద్ర మోహన్ సమీక్ష నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే ఈ కళ్యాణ ఉత్సవాల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. వారం రోజులు పాటు వైదిక పరంగా చేయాల్సిన కార్యక్రమాల్లో ఎటువంటి లోటు పాట్లు లేకుండా చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా లోపం జరిగితే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు వెనకాడేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో దేవస్థానానికి చెందిన వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ప్రధాన అర్చకులు, పండితులు పాల్గొన్నారు.

14 వరకూ ఓటు నమోదు అవకాశం

ప్రజాశక్తి - పిఠాపురం

కొత్తగా ఓటు నమోదుకు ఈ నెల 14 తేదీ వరకు అవకాశం ఉన్నట్టు పిఠాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెసి ఎస్.రామసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు ఫారం -6 దరఖాస్తు చేసుకోవాలని, హోమ్ ఓటర్లు 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, శారీరక అంగవైకల్యం గల ఓటర్లు ఇంటి వద్దే ఓటు వేసే సదుపాయం కోసం ఈ నెల 22 తేదీ లోపు ఫారం - 12డిని సంబంధిత బిఎల్ఒ ద్వార రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విధుల్లో అలసత్వ ం వద్దు

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించకుంటే చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో పోలీసు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. సిఐ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు పోలీసుల సహకారాన్ని పూర్తి స్థాయిలో అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ వసంత్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకుల, గ్రాసుస్తులు

నేడు 'సంఘం శరణం గచ్ఛామి' నాటిక ప్రదర్శన

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని మల్లాం గ్రామంలో గురువారం 'సంఘం - శరణం- గచ్ఛామి' నృత్య రూపక నాటిక ప్రదర్శన ఉంటుందని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ రూపొందించిన ఈ నాటికను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), అంబేద్కర్ యువజన సంఘం, అంబేద్కర్ వ్యవసాయ కూలి సంఘం, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రదర్శించబోయే ఈ నాటకాన్ని గురువారం సాయంత్రం 6 గంటలకు జరుగుతుందని, గ్రామ ప్రజలు తిలకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.సూరిబాబు, కె.సింహాచలం, జి.లోవబాబు, కె.కృష్ణారావు, కె.లచ్చబాబు, డి.సత్తిబాబు, పి.చిన్ని, కె.లోవరాజు, డి దుర్గారావు, డి.శ్రీను, బి.నాగచక్రం పాల్గొన్నారు.


గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

పూర్వ విద్యార్థులంతా ఒక చోట చేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠాలు చెప్పిన గురువులను సత్కరించారు. మండలంలోని పి.మల్లవరం జడ్‌పి ఉన్నత పాఠశాల లో1988-89 ఏడాది 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం ద్వారా కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువు బండి సత్యన్నారాయణ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ ధూళిపూడి వెంకటరమణ మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం 10వ తరగతి పూర్తి చేసుకున్న మనం ఒక కుటుంబంగా కలుసుకోవడం సంతోషకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఖండవిల్లి సురేష్, నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మన మొదటి బ్యాచ్ గుర్తుగా పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల సతీష్, శారద, పద్మ, మధు, మూర్తి, చంటి పాల్గొన్నారు.

అధికారికంగా పూలే జయంతి

ప్రజాశక్తి - కాకినాడ

ఏప్రియల్ 11వ తేదీన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ జె.నివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ ఉదయం 10.00 గంటలకు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఎదురుగా గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఓటు హక్కును వినియోగించుకోండి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ శంకర్రావు

ప్రజాశక్తి - కోటనందూరు

స్వచ్ఛత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోటనందూరు ఎస్ఐ బి.శంకర్రావు సూచించారు. బుధవారం మండలంలోని కెఇ చిన్నయ్యపాలెం, అల్లిపూడి గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శంకర్రావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరక్కుండా ముందస్తు చర్యలో భాగంగా కవాతును నిర్వహించినట్లు తెలిపారు. ఓటర్లను ఎటువంటి భయభ్రాంతులకు గురిచేసిన పోలీసుల రక్షణగా ఉంటారని తెలిపారు.

1.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

ప్రజాశక్తి - సామర్లకోట


ఆర్‌బికె సిబ్బందితో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి విజయ్‌కుమార్

ప్రస్తుత దాళ్వా సీజన్లో జిల్లావ్యాప్తంగా 1.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ కుమార్ చెప్పారు. బుధవారం మండలంలోని వేట్లపాలెం గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సందర్శించి ధాన్యం కొనుగోలు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైన్ రకం ధాన్యంతో బయటి మార్కెట్లో ఎక్కువ ధర లభిస్తున్నందున రైతులు బయటి మార్కెట్లో విక్రయిస్తున్నారని, బొండాలు రకం సాగు చేసిన ధాన్యంకు బయటి మార్కెట్ కంటే రైతు భరోసా కేంద్రాల్లోని రూ.200 అదనంగా వస్తున్నందున్నారు. 17 శాతం తేమ శాతం వచ్చే విధంగా ధాన్యాన్ని రైతులు కళ్ళాల్లో ఆరబెట్టుకుంటున్నట్లు చెప్పారు. అలాగే ఆర్‌బికేలలో గోనెసంచుల లభ్యతపై ఆరా తీశారు. రైతులు దళారులు నమ్మి తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దని సూచించారు. నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని సాధారణ రకం 100 కేజీలు రూ.2183, 75 కేజీలు రూ.1637, 40 కేజీలు రూ.873 , గ్రేడ్ ఏ రకం 100 కేజీలకు రూ.2203, 75 కేజీలు రూ.1652, 40 కేజీలు 881లకు ధాన్యాన్ని ఆర్‌బికేల్లో కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. సామర్లకోట మండలంలో 22,500 ఎకరాల్లో సాగు చేశారని ఇప్పటివరకు 1500 ఎకరాల్లో పంట కోతలు జరిగాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం నాటికి ఐదు మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య, ఎఇఒ సతీష్, విహెచ్ఎ నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోమియోపతి దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఐడిఎ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ హోమియోపతి దినోత్సవం జరిగింది. సర్పవరం జంక్షన్‌లోని తేజ హోమియో ఆసుపత్రిలోని హోమియో వైద్యులు డాక్టర్ ఐ.రామ్మోహన్‌రావు ని కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యాన ప్రపంచ సంధర్భంగా ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ఐడిఎసిడిహెచ్ కన్వీనర్ డాక్టర్ అడ్డాల మాట్లాడారు. వైద్యశాస్త్రంలో తీయనైన, నొప్పి లేని వైద్యం హోమియోపతి వైద్యమని అన్నారు. హోమియోపతి వైద్యులు డాక్టర్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా హోమియోపతి దినోత్సవాన్ని జరుపుకుంటారని అన్నారు. హోమియోపతిపై అవగాహన కల్పించడమే ప్రపంచ హోమియోపతి దినోత్సవం లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఐడిఎ అధ్యక్షుడు డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ సిరాజ్, పద్మావతి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

15 నుంచి వేట నిషేధం అమలు

ప్రజాశక్తి - యానాం

సముద్రంలో వేట నిషేధం ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు అమలు చేస్తున్నట్టు యానాం మత్స్య శాఖ సహాయ సంచాలకులు దడాల గొంతయ్య ఒ ప్రకటనలో తెలిపారు. 61రోజుల పాటు వేట నిషేధం అమలులో ఉంటుందని, ఈ సమయంలో మత్స్యకారులు ఎవరూ యంత్రపు బోటులు, ఎఫ్‌ఆర్‌పి బోటులు, ఇంజన్ నావలపై సముద్రంలోకి వేటకు వెళ్లరాదని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను మత్స్యకారులు విధిగా పాటించాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రక్తబంధం జీవితాంతం కొనసాగాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రక్తసంబంధీకుల మధ్య బంధం జీవితాంతం కొనసాగాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణరాజు ఆకాంక్షించారు. బుధవారం బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడదాకా నిలిచి ఉండే బంధం రక్తసంబంధం అని అన్నారు. కానీ నేడు ఆస్తి వివాదాలు, మాట పట్టింపులతో, సరిహద్దు గొడవలతో ఆగర్భ శత్రువులుగా మారి తల్లిదండ్రులను మానసిక వేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రమణమూర్తి, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా బద్దికొడుగు ఉత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కాండ్రకోట గ్రామంలో 45 రోజులపాటు జరిగే నూకాలమ్మ జాతర ఉత్సవంలో బుధవారం బద్దికొడుగు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి తలాటం సూర్యనారాయణ, ధర్మకర్తల మండలి చైర్మన్ గవరసాన వీరాస్వామి ఆధ్వర్యంలో భాజా భజంత్రీలు, గరగలు, డప్పులు నృత్యాలతో ఈ ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏలేరు వద్దకు వెళ్లి బద్దిని కడిగి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు భావిశెట్టి గంగరాజు, రొంగల తమ్మారావు, లక్కాకుల కృష్ణ, మందా త్రిమూర్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏడాది పూర్తి చేసుకున్న ఆర్య జనని

ప్రజాశక్తి - తాళ్లరేవు

లయన్స్ క్లబ్ ఆర్య జనని పథకం ద్వారా స్థానిక సిహెచ్‌సిలో ప్రతి బుధవారం గర్భిణీ స్త్రీలకు ఇచ్చే పౌష్టికాహార భోజనం బుధవారంతో ఏడాది పూర్తి చేసుకున్నట్టు లయన్స్ క్లబ్ ప్రతినిధి బి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని పాత కోరంగికి చెందిన చిట్టూరి కృష్ణ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఆర్య జనని పథకం ద్వారా 2,650 మంది గర్భిణీ స్త్రీలకు భోజనాలు అందించినట్టు తెలిపారు. ఆర్య జనని ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా చిట్టూరి కృష్ణ కుమారుడు శివరామ కిషోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ, కట్ట ఆదినా రాయణ, సతీష్ రాజు, నున్న దత్తు, పొన్నాడ రాజు పాల్గొన్నారు.

ఐదు శాతం పన్ను రాయితీ

ప్రజాశక్తి - పిఠాపురం

2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులు ఒకేసారి ఏక మొత్తంలో చెల్లించిన వారికి పన్నులో ఐదు శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను యజమానులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఈ నెల 30 తేదీ లోపు మొత్తం పన్ను ఒకేసారి చెల్లించి ఐదు శాతం రాయితీ పొందాలన్నారు.

తనిఖీల్లో రూ. 2.74 లక్షల సీజ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం పరిధిలోని పోలేకుర్రు, జార్జిపేట వై. జంక్షన్ చెక్ పోస్ట్ వద్ద బుధవారం రాత్రి చేసిన తనిఖీల్లో రూ.2.74 లక్షల నగదును సీజ్ చేసినట్టు కోరంగి ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా అమలాపురం నుంచి తుని వెళుతున్న కారులో ఎటువంటి పత్రాలు లేకుండా రూ 2.74లక్షల నగదు కనుగొని సీజ్ చేశామన్నారు. అదేవిధంగా నీలపల్లి శివారు ప్రాంతంలో బుధవారం నలుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 72 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ


కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న బేబీ రాణి,. చంద్రావతి తదితరులు

అంగన్‌వాడీ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎపి అంగన్‌వాడీ అండ్ హెల్పర్ యూనియన్ నాయకులు కోరారు. బుధవారం ఈ మేరకు యూనియన్ నాయకులు కలెక్టర్ జె.నివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి మాట్లాడుతూ కాకినాడ జిల్లా వ్యాప్తంగా 1986 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 1980 సెంటర్లకు సెల్ ఫోన్లు ఇచ్చారన్నారు. కాకినాడ అర్బన్‌లో 6 సెంటర్లకు సెల్‌ఫోన్లు ఇవ్వలేదన్నారు. ఇచ్చిన ఫోన్లకు 2జివి డేటా ఇవ్వడం వల్ల డేటా ముందుగానే అయిపోతుందని, సెల్‌ఫోన్ సక్రమంగా పనిచేయడం లేదన్నారు. ఐదో తేదీలోపు రావాల్సిన స్టాక్ నేటికీ సెంటర్లకు రాలేదని తెలిపారు. పాలు బాల సంజీవని కిట్లు, పప్పు, బియ్యం, ఆయిల్ రానందున ఎఫ్‌ఆర్‌ఎస్ వేయడం కష్టంగా ఉందన్నారు. స్టాకు మొత్తం ఒకేసారి ఇస్తే రెండు రోజుల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ పూర్తవుతుందని తెలిపారు. అన్ని యాప్‌లను ఒకే యాప్‌లో తీసుకువస్తామని డైరెక్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ హామీ ఇచ్చారని, ఆ హామీ నేటికీ అమలు చేయలేదని వివరించారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి, తదితరులు పాల్గొన్నారు

రూ.4.4 కోట్ల విలువైన నగదు, మద్యం సీజ్

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల కోడ్ పటిష్ట అమలులో భాగంగా ఎలక్షన్ సీజూర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు జిల్లాలో జరిపిన తనిఖీల్లో మొత్తం రూ.4 కోట్లు 4 లక్షల విలువైన నగదు, మద్యం, వస్తువులను సీజ్ చేయడం జరిగిందని కలెక్టర్ జె.నివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.54 లక్షల 17 వేలు నగదు, రూ.కోటి 13 లక్షల 74 వేల విలువైన 1,34,011 లీటర్ల మద్యం, రూ.13 లక్షల 40 వేలు విలువైన 2,26,213 గ్రాముల మాదక ద్రవ్యాలు, రూ.కోటి 91లక్షల రూపాయల విలువైన 118 గ్రాముల వెండి, బంగారం, రూ.31 లక్షల 29 వేల విలువైన 56 వేలు ప్రలోభ సామాగ్రిని సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తుందన్నారు.

తుది ప్రచురణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం తుది ప్రచురణ, ఓటర్ లిస్టులలో తొలగింపులు, చేర్పులు, సవరణలపై బుధవారం ఎలక్ట్రోరల్ అధికారి, ఆర్‌డిఓ జె.సీతారామారావు అవగాహన కల్పించారు. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధతలకు సంబంధించిన అంశాలు, ప్రక్రియ, ఎంసిసి నియమావళి, తీసుకోవలసిన చర్యలపై వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతవాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు గవరసాన సూరిబాబు, గోపు మురళి, రంది సత్యనారాయణ, నీలపాల సూరిబాబు పాల్గొన్నారు.

జనసేన జిల్లా అధ్యక్షునికి ఘన సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట


రామస్వామిని సత్కరిస్తున్న అభిమానులు

జనసేన పార్టీ కాకినాడ జిల్లాకు అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన తుమ్మల రామస్వామిని అభిమానులు ఘనంగా సత్కరించారు. బుధవారం స్థానిక అన్నపూర్ణ ఫంక్షన్ హాల్లో జరిగిన సత్కార సభ టిడిపి పెద్దాపురం నియోజక వర్గ అభ్యర్థి, ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ నూతనంగా జిల్లాలో ఎంపీ స్థానంతోపాటు, ఏడు ఎంఎల్‌ఎ స్థానాలను కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కూటమి విజయం తథ్యమని ఇప్పటికే సర్వేలు స్పష్టంగా చెబుతున్నాయని అన్నారు. పార్టీ పక్షాన పోటీ చేయాలని భావించిన ఆశావహుల్లో కొందరికి టిక్కెట్టు దక్కక పోవడంతో పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌పై నిందలు వేయడం సరికాదన్నారు. త్వరలోనే వారి తప్పులు తెలుసుకుని తిరిగి పార్టీలోకి వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామస్వామిని జనసేన, టిడిపి, బిజెపి నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు నిమ్మకాయల రంగనాగ్, సరోజ, మంచెం సాయి, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్, రాజా సూరిబాబు రాజు, వల్లూరి దొర, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మారుతున్న కాలానికి అనుగుణంగా యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పైల సుభాష్‌చంద్రబోస్ అన్నారు. ఇస్రో శిక్షణకు ఎంపికైన ఏలేశ్వరంకు చెందిన స్పార్క్ ఫౌండేషన్ బృందాన్ని ఆయన బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రోకు రాష్ట్రం నుంచి మొట్టమొదటిసారి ఎంపికైన స్పార్క్ ఫౌండేషన్ బృందం సభ్యుల కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్పార్క్ ఫౌండేషన్ చైర్మన్ ఎన్.సాయిసందీప్, రీజనల్ కో ఆర్డినేటర్ రవికిరణ్, కోఆర్డినేటర్ ఆదిత్య పాల్గొన్నారు.

పవిత్రమైన పండుగ రంజాన్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మహమ్మద్ ప్రవక్త మార్గ నిర్దేశం చేసిన మహత్తరమైన పండుగ రంజాన్ అని షేక్ షఫీ అన్నారు. బుధవారం స్థానిక ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం పేద కుటుంబాలకు చెందిన మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖురాన్ అవతరించిన నెల కావడంతో ఈ నెలను ముస్లిం కుటుంబాలు ఎంతో పవిత్రంగా భావిస్తాయని తెలిపారు. ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు, రాజా, రాఘవరావు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొంటే విధుల నుంచి తొలగింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వాలంటీర్లు రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొనరాదని, ఎవరైనా పాల్గొంటే విధులు నుంచి తొలగించడం జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఓ జె సీతారామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను పెడచెవిని పెట్టి కొంతమంది వాలంటీర్లు రాజకీయ పార్టీల నాయకులు నిర్వహించే సమావేశాలకు, ర్యాలీలకు హాజరవుతున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట


విద్యార్థులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పెద్దాపురం పట్టణంలోని నాగమ్మపేటలోని రాజీవ్ గాంధీ మున్సిపల్ పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్న టోఫెల్ విద్యా పరీక్ష కేంద్రాన్ని సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు బుధవారం ఎంఇఒ ప్రభాకర్ శర్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ ఏజ్ ఏ ఫారెన్ లాంగ్వేజ (టిఒఇఎఫ్‌ఎల్)పరీక్ష విధానాన్ని, పరీక్ష అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇంగ్లీషు భాషపై పట్టు సాధించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ పరీక్షా విధానం వల్ల విద్యార్థులు అంతర్జాతీయ ఇంగ్లీష్ భాషపై ప్రావీణ్యత సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాపూజీ, సిఆర్‌పిలు కళ్యాణ్, వీరబాబు, సతీష్, మూర్తి, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సామర్లకోట మండలంలోని ప్రైమరీ పాఠశాలలో టోఫెల్ ఎగ్జామ్‌ను ఐఎఫ్‌బి, స్మార్ట్ టీవీల ద్వారా నిర్వహిస్తున్న పరీక్షల తీరును చామంతి నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో వర్క్ బుక్స్, నోట్స్, పాఠశాల పరిసర వాతావరణాన్ని పరిశీలించారు. అలాగే మండలంలోని అచ్చంపేట యుపి స్కూల్‌ని ఎంఇఒ-2 పి.పుల్లయ్యతో కలిసి పరిశీలించారు.

మర్రిపాక వాలంటీర్లు రాజీనామా


రాజీనామా పత్రాలను చూపెడుతున్న వాలంటీర్లు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మర్రిపాక గ్రామానికి చెందిన 14 మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. సంబంధిత రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ జగతం ఆనంద్‌రావు, గ్రామ వైసిపి నాయకులు సతీష్ ఆధ్వర్యంలో వైసిపి కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను, వైసిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి తోట నరసింహం ను మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు ప్రకటించారు.

వరి సాగు ఆశాజనకం

ఎకరానికి 50 నుంచి 60 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రస్తుతం దాళ్వా వరి చేలు పంటలు పూర్తిగా పండి కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే ముందుగా నాట్లు వేసిన రైతులు వరి కోతలు ప్రారంభించారు. సుమారు 5 శాతం కోతలు ప్రారంభం కాగా మరో వారంలో పూర్తిస్థాయి వరి కోతలు ప్రారంభమవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

రామచంద్రపురం మండలంలో 17 వేల ఎకరాల్లోనూ, కె.గంగవరం మండలంలో 15 వేల ఎకరాల్లోనూ వరి పంట సాగు అవుతోంది. ఈ ఏడాది



కోతకు సిద్ధంగా ఉన్న దాల్వా వరిచేలు

వాతావరణం అనుకూలించడంతో పంటలు ఆశ జనకంగా ఉన్నాయి. ఇప్పటికే వరి కోతలు పూర్తయిన ఒకటి రెండు చోట్ల ధాన్యం 50 నుంచి 60 బస్తాల మధ్యలో దిగుబడులు వచ్చాయని రైతులు తెలియజేస్తున్నారు. పంటలు బాగా పండడంతో రైతుల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. మొదట్లో దాళ్వా వరి చేలకు సాగునీటి సమస్యల ఉత్పన్నం కాగా వాటిని ఇరిగేషన్ అధికారులు పరిష్కరించడంతో రైతులు పంట కాలాన్ని పూర్తి చేశారు. దీంతో పాటు ఈ ఏడాది వరి చేలకు తెగుళ్ల బెడద అంతంతమాత్రంగానే ఉండడంతో పంటలు బాగా పండేందుకు ఉపయోగపడింది. మరో వారంలో కోతల ప్రారంభమై మే నెలాఖరు నాటికి పూర్తవుతాయని మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. అయితే దాళ్వా వరి చేలలో అధిక శాతం మంది రైతులు బొండాలు రకం పంట వేసుకున్నారు. తొలకరి మాదిరిగానే క్వింటాలుకు రూ 283లు, అదే 70 కేజీలకురూ. 1637లు మద్దతు ధర కొనసాగుతుంది. రైతన్న కష్టపడి పండించిన పంటలకు కోతలు పూర్తయిన వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులకు సొమ్ములు సకాలంలో చెల్లించాలని రైతన్నలు కోరుతున్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలి. రవాణా ఛార్జీలు, హమాలీ చార్జీలు తో కలిపి క్వింటాలుకురూ రూ.2250 వరకూ లబ్ది పొందే అవకాశం. ప్రస్తుతం దిగబడులు 50 నుంచి 60 బస్తాలు మధ్య ఉండవచ్చు. కోతలు పూర్తయిన రైతన్నలు పచ్చిరొట్ట విత్తనాలు పిల్లి పెసర, జనుము, జీలుగా వంటి వాటిని చల్లుకోవాలి వీటిని 50 శాతం సబ్సిడీతో అందజేస్తారు. అయితే సబ్సిడీ అపరాలకు ఎన్నికల కమిషన్ అనుమతులు రావాల్సి ఉందన్నారు.

-బి.రవి,మండల వ్యవసాయ అధికారి



పల్నాడులో జగన్ సమక్షంలో చేరిన మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరి దేవి

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బుధవారం వైసిపిలో చేరారు వివరాలు ఇవి..

మామిడికుదురు పి.గన్నవరం మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరి దేవి బుధవారం పల్నాడు లో వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి బుధవారం సమక్షంలో వైసిపిలో చేరారు. పి.గన్నవరం నియోజకవర్గ జనసేన ఇన్చార్జిగా ప్రస్తుతం కొనసాగుతున్న ఆమె పార్టీ కార్యక్రమాలలో పెద్దగా పాల్గొనకపోవడంతో ఈ సారి జనసేన సీటు దక్కలేదు. నియోజకవర్గంలో బలమైన అభ్యర్థిగా గుర్తింపు పొందిన రాజేశ్వరి దేవి వైసీపీలో ఆమె జనసేన నాయకులులతో కలిసి చేరడంతో వైసిపి శ్రేణులలో ఆనందోత్సవాలు మొదలయ్యాయి.

మండపేట వైసిపిలో ఉండే కార్యకర్తలు అందరికీ పార్టీ వెన్నుదన్నుగా ఉంటుందని ఎంఎల్సి తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండలంలోని ఏడిద నుంచి గత పంచాయితీ ఎన్నికల్లో జనసేన నుంచి సర్పంచ్ గా పోటీ చేసిన పలివెల సూర్యారావు బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. స్థానిక విజయలక్ష్మి నగర్ లో ఎంఎల్సి తోటను కలిసి ఆయన సమక్షంలో వైసిపిలోలో చేరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రెడ్డి రాధాకృష్ణ, మేడిశెట్టి సూర్యభాస్కరరావు, వల్లూరి రామకృష్ణ, పోతంశెట్టి వరప్రసాద్, ముమ్మిడివరపు బాపిరాజు, యాండ్ర ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్ల పాలంలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని తాళ్ల పొలం గ్రామం లో బుధవారం వైసిపి అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వైసిపిలో చేరారు. వారిలో దెయ్యాల సత్యనారాయణ అతని అనుచరులు వైసిపిలో చేరారు వారందరికీ సూర్యప్రకాష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ముఖ్యమంత్రి జగన్ పాలన ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాపాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పిహెచ్‌సిల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

కపిలేశ్వరపురంరూరల్ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కపిలేశ్వరపురం మండలంలోని అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్యాధికారి డాక్టర్ అనూజ ప్రియాంక ఆధ్వర్యంలో 25 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వారిలో హైరిస్క్ గర్భిణులను 6 మందిని గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు, లేబరేటరీ పరీక్షలు జరిపి వారికి మందులను అందజేశారు. అనంతరం డాక్టర్ జె. అనూజా ప్రియాంక మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు అనంతరం గర్భిణులు ఆరోగ్యం పట్ల పాటించవలసిన నియమాలు జాగ్రత్తలు గర్భిణులు తీసుకోవలసిన పౌష్టికాహారం, ఆసుపత్రిలో ప్రసవాల ప్రాముఖ్యత , ప్రభుత్వం ద్వారా కలిగే ప్రయోజనాలు, తదితర వాటిపై ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు



అంగరలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనూజా ప్రియాంక

వివరించారు. కార్యక్రమంలో హెచ్‌వి టి.మేరీ మణి, ఎఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు. **అంబాజీపేట**ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు సక్రమంగా పాటిస్తే ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించవచ్చని ముక్కామల పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. ఎఫ్ డి పి ప్రోగ్రాంలో విధులను నిర్వహిస్తున్న ఆమె బుధవారం ముక్కామల పిహెచ్‌సి వైద్యాధికారిణిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పిఎంఎస్ఎంఎ ప్రోగ్రాంలో పాల్గొని 24 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలు, రక్త పరీక్షలు నిర్వహించారు.అవసరమైన మందులు అందజేసి ఆరోగ్యం పట్ల పాటించాల్సిన నియమాలు జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వద్దులు, పిల్లలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య విషయంలో అత్యవసరమైతే 108,102 లను సంప్రదించాలన్నారు. అనంతరం గర్భిణులకు పోషకాహారం,పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొని సేవలందించారు.



ముక్కామల్లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఇంద్రావతి

టిడిపిలోకి పద్మశాలి సంఘం అధ్యక్షుడు

ప్రజాశక్తి- రామచంద్రపురం

పట్టణంలోని మాజీ కౌన్సిలర్, పద్మశాలి సంఘం అధ్యక్షులు మామిడి మంగరాణి, లక్ష్మీ నారాయణ దంపతులు బుధవారం టిడిపిలో చేరారు. పట్టణంలో టిడిపి అభ్యర్థి వాసం శెట్టి సుభాష్ పర్యటనలో భాగంగా మామిడి సత్య నారాయణ, పద్మశాలిసోదరులు, టిడిపి, జనసేన, బిజెపిల ఉమ్మడి అభ్యర్థి సుభాష్ సమక్షంలో టిడిపిలో చేరారు. సార్వత్రికఎన్నికల్లో మహా కూట మికి సంపూర్ణ మద్దతును తెలియజేసి టిడిపి విజ యానికి కృషి చేస్తామని పద్మశాలీలు తెలి పారు. టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

150 మందికి భోజనం అందజేత

ప్రజాశక్తి-అమలాపురం

నల్లా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నల్లా పవన్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రి నందు హాస్పిటల్ సూపర్ వైజర్ శంకరరావు చేతుల మీదుగా 150 మంది హాస్పిటల్ కి వచ్చే ఒపి పేషెంట్ లకు, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు భోజనాలు అందించారు. ఈ సందర్భంగా నల్లా పవన్ మాట్లాడుతూ హాస్పిటల్ సూపరింటెండెంట్ శంకరరావు ప్రతినెలా 9న ఒపి పేషెంట్ లకు స్కాన్ లు తీస్తామని వారికి భోజన ఏర్పాట్లు చేయమని అడిగారన్నారు. ఆరోజు కూడా ఏర్పాటు చేయుటకు సానుకూలంగా వున్నామని అన్నారు. కార్యక్రమంలో గనిశెట్టి అరవింద్, అయ్యల భాషా, నాగ సుధా కొండ,సలాది నాగేశ్వరరావు, ఎఆర్‌టి హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, డాక్టర్ రత్నమణి తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామ మెయిన్ రోడ్ లో పోలీసుల కవాతు

ద్రాక్షారామలో పోలీసు కవాతు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ద్రాక్షారామం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు, కేంద్ర బలగాలతో పట్టణంలో బుధవారం కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు, ఓటర్లు నిర్భయంగా వెళ్లి ఓటు వేసేందుకు, శాంతి భద్రత పరిరక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేశామని ఈ సందర్భంగా డిఎస్‌పి రామకృష్ణ, సిఐ వి.దొరరాజు, ద్రాక్షారామ ఎస్ఐ సురేంద్ర తెలిపారు. ద్రాక్షారామ మెయిన్ రోడ్డు, వెలంపాలెం రోడ్డు, కాకినాడ రోడ్లలో ఈ కవాతు నిర్వహించారు.



రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లిమ్‌లు

ఆనందోత్సాహాలతో రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి -మామిడికుదురు

ముస్లింల పవిత్ర రంజాన్ వేడుకలు నగరం, మామిడికుదురులో బుధవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు నెలవంక దర్శనంలో ఏర్పడిన సందిగ్ధం నేపథ్యంలో జాతీయ ముస్లిం నాయకుల సూచన మేరకు రంజాన్ వేడుకలను జరుపుకున్నారు. మామిడికుదురులోని మసీదుల్లో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు సుదూర ప్రాంతాల నుండి ముస్లింలు తరలివచ్చి మసీదుల్లో వేడుకల్లో పాల్గొన్నారు దీనికి సంబంధించి ఆయా మసీదు కమిటీలు భక్తులకు సౌకర్యాలు కల్పించాయి

ఘనంగా డాక్టర్ హనేమాన్ జయంతి

ప్రజాశక్తి-మండపేట

. హోమియోపతి వైద్య పితామహుడు డాక్టర్ హనేమాన్ 270 వ జయంతిని మండపేటలోని గౌతమి హోమియో వైద్యశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండపేటకు చెందిన హోమియో వైద్యులు డాక్టర్ చల్లా రవికుమార్ మాట్లాడుతూ హోమియో వైద్య విధానాన్ని సంపూర్ణ చికిత్స విధానంగా రూపుదిద్దిన మహనీయులు హోమియో వైద్య సృష్టికర్త డాక్టర్ హనేమాన్ అని అన్నారు వివిధ రోగాలను తగ్గించగల అనేక రసాయనాలని తన శరీరంపై ప్రయోగించుకోవడం ద్వారా, వివిధ పదార్థాల్లో ఉన్న రసాయనిక ఔషధ ధర్మాన్ని ఆయన కనిపెట్టారని పేర్కొన్నారు. తొలుత డాక్టర్ హనేమాన్ చిత్రపటానికి గౌతమి హోమియో క్లినిక్ వైద్యులు డాక్టర్ చల్లా రవికుమార్, డాక్టర్ మెహర్ ప్రసన్నలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిం చారు. కార్యక్రమంలో డాక్టర్ నీరజ, డాక్టర్ నాగదేవి, డాక్టర్ హనీచైతన్య, మెడికల్ అసిస్టెంట్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్దే లక్ష్యంగా పని చేస్తా

ప్రజాశక్తి -మామిడికుదురు

అభివృద్దే లక్ష్యంగా పని చేస్తానని రాజోలు ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ అన్నారు. గెద్దాడ విత్తనాల శాఖర్ ఆధ్వర్యంలో ఉమ్మడి అభ్యర్థి ముఖ్య అతిథిగా దేవ వరప్రసాద్ పాల్గొని బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గెలిచిన మొదటి రోజు నుంచే ప్రజా సమస్యలతో పాటు నియోజకవర్గ అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ దీర్ఘ కాలంగా పేరుకు పోయాయిన సమస్యలు పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమం లో కంచి అప్పన్న, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, గుండాబత్తుల తాతాజీ, బందెల పద్మ, మోకా పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నామినేషన్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు జెసి ఎన్.తేజ్‌భరత్ అవగాహన కల్పించారు. బుధవారం జెసి చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ నామినేషన్ రోజున నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. నామినేషన్ ప్రక్రియపై సందేహాలు ఉంటే జెసి ఛాంబర్ వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలన్నారు. నమూనా నామినేషన్లను పరిశీలించాలన్నారు. నామినేషన్ ప్రక్రియలో నిబంధనలు పాటిస్తున్నారో లేదో తెలుసుకునేందుకు ప్రతినిధులకు చెక్ లిస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. అభ్యర్థి, ప్రతిపాదించే వ్యక్తి, మరో ముగ్గురు మాత్రమే ఆర్ఓ గదిలోకి అనుమతిస్తామని తెలిపారు. పోలింగ్ అధికారి (ఒపిఒ), మైక్రో అబ్జర్వర్‌గా తమ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వేయడానికి రాజమహేంద్రవరం రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో ఫారం-12 సేకరణ కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగిన ఇతర పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్ ఫారం 12 దరఖాస్తుతో పాటు వారికి జారీ చేసిన డ్యూటీ ఆర్డర్ కాపీతో పాటు ఓటరు గుర్తింపు కార్డు కాపీ, ఆర్డర్ కాపీ, ఆధార్ కాపీని సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. రాజామహేంద్రవరం రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేకరణ కేంద్రంలో ఏప్రిల్ 22న వివరాలు నేరుగా అందించాలన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్‌విబిఎస్.ఆచారి, జి.సత్యనా రాయణ, కె.రామకృష్ణ, చెల్లుబోయిన నరేన్, వివి.సత్యనారాయణ, రూరల్ తహశీల్దార్ వైకెవి.అప్పారావు, కడియం తహశీల్దార్ బి.రమాదేవి, ప్లానింగ్ అధికారి కోటయ్య, డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి తేజ్‌భరత్



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు

పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - నిడదవోలు

రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్ వైపు చూస్తున్నారని ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. నిడదవోలు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి పెద్దిరెడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమీక్ష సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అరిగెల అరుణకుమారి విచ్చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విధానాలను పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, హీరాలాల్, అన్వర్ ఖాన్, షేక్ కాశి, జమీర్ ఖాన్ జిలానీ, పడాల అచ్యుతరాజేశ్వరి, భావన రమేష్, ఎ.బలరామ్ పాల్గొన్నారు.

స్కిప్పింగ్‌లో ఎస్‌కెఆర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ కనబర్చారు. కళాశాలలో మ్యాథ్స్, ఆనర్స్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిలు ఎ.యామినిదేవి, ఎం.నాగదేవి నన్నయ యూనివర్సిటీ వారు భీమవరం డిఎన్ఆర్ కాలేజీలో నిర్వహించిన ఇంటర్ కొలజియేట్ రోప్ స్కిప్పింగ్ సింగిల్ టచ్ ఈవెంట్‌లో ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 4 నుంచి 6వరకూ భోపాల్‌లో ఎల్ఎన్ సిటీ యూనివర్సిటీలో నిర్వహించిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ ఎమ్ అండ్ డబ్ల్యూ ఛాంపియన్ షిప్‌లో వారు పాల్గొన్నారు. ఎ.యామినీదేవి ప్రతిభను కనపరచి రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి కళాశాల పీడీ వై.సుధారాణిని, విద్యార్థులను అభినందించారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా మార్టిన్ లూథర్

ప్రజాశక్తి - గోపాలపురం, దేవరపల్లి రూరల్



గోపాలపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చూడాబాసి మార్టిన్ లూథర్ పోటీ చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైస్ షర్మిల ఈ మేరకు టిక్కెట్‌ను కేటాయించారు. ఆమె చేతుల మీదుగా అభ్యర్థిత్వం పత్రాని తీసుకున్నారు. మార్టిన్ విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు. దీంతో ఆయనకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ తరపున టిక్కెట్ దక్కింది.

చేతన్‌కు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - కడియం

కడియంకు చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, రాజమహేంద్రవరం ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ గిరజాల రామతులసి దంపతుల అల్లుడు పి.సాయిసుబ్రహ్మణ్యచేతన్‌కు జాతీయ విశ్వకర్మ పురస్కారం దక్కింది. నీతి ఆయోగ్, భారతీయ నిర్మాణ పరిశ్రమ కలిసి ఏర్పాటుచేసిన కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సిఐడిసి) పురస్కారాల కార్యక్రమాన్ని న్యూఢిల్లీలో నిర్వహించింది. 15వ సిఐడిసి విశ్వకర్మ అవార్డులు కార్యక్రమంలో అఛీవ్‌మెంట్ అవార్డు ఫర్ ఇన్నోవేటర్‌గా అరవింజ్ సాఫ్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.సాయిసుబ్రహ్మణ్యచేతన్ అందుకున్నారని గిరజాల బాబు తెలిపారు. నిర్మాణ రంగానికి సంబంధించి 'ఈజీ ఇండియా' యాప్‌ను రూపొందించినందుకు ఈ పురస్కారం అందించారు. ఈ పురస్కారం రావడం పట్ల గిరజాల దంపతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- కడియం

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (గతంలో ఆంధ్ర ప్రదేశ్ వైద్య విధాన పరిషత్)లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, ప్రతి నెల మొదటి తేదీన జీతాలు చెల్లించాలని ఎపి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. కడియంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జీతాలు ఆలస్యం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మార్చి నెల జీతాలు ఇప్పటివరకూ అందలేదన్నారు. ఉగాది, రంజాన్ నాటికి జీతాలు వస్తాయేమో అని ఎదురు చూశామని కానీ రాలేదన్నారు. జీతాలు ఎప్పుడు చెల్లిస్తారో కచ్చితమైన తేదీని నిర్ణయిస్తే, తదను గుణంగా ఉద్యోగులు సర్దుకుపోవడానికి వీలుంటుందన్నారు. నెలంతా కష్టపడితే జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి దాపురించిందన్నారు. ఇతర శాఖలతో చూస్తే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. ప్రధానంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను గమనించి వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు.

భార్య, కుమార్తెతో కలిసి దవులూరి ప్రచారం

ప్రజాశక్తి - సామర్లకోట

భార్య, కుమార్తెలతో కలిసి పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి దవులూరి దొరబాబు బుధవారం మండలంలోని పెదబ్రహ్మదేవంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. దొరబాబు, అతని సతీమణి చంద్రకళ, కుమార్తె సార్వికలకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రకళ మాటాలడుతూ ఐదేళ్లగా కుటుంబాన్ని విడిచి నియోజకవర్గ ప్రజల్లో మమేకమై ఉంటున్న దవులూరి దొరబాబును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఐదేళ్లగా పెద్దాపురం నియోజవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. దొరబాబు కష్టాన్ని గుర్తించి సిఎం జగన్ పెద్దాపురం టిక్కెట్ కేటాయించారన్నారు. స్థానికుడైన దొరబాబుకు ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి విజయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటింటికి వెళ్లి పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. సాయంత్రం దొరబాబు స్థానిక 28వ వార్డులో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు దవులూరి సుబ్బారావు, పిబి.దేవం ఎంపిటిసి సభ్యులు మలకల సూర్యారావు, నాయకులు డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర, తలారి దొరబాబు, ఎలిసెట్టి నరేష్, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



భార్య, కుమార్తెతో కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న దొరబాబు

సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కడియం

తనిఖీ కేంద్రాల వద్ద విధులను నిర్వర్తించే వివిధ శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత, ఎస్‌పి పి.జగదీష్ సూచించారు. కడియం మండలం పొట్టిలంక జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను వారు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. తనిఖీ కేంద్రాల వద్ద విధులను నిర్వర్తించే అధికారులు, సిబ్బంది జవాబుదారీతనం కలిగి ఉండాలన్నారు. చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించే క్రమంలో ప్రతి అంశం రికార్డు చేయడం, రిజిస్టర్‌లో కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. పోలీస్, ఎక్సైజ్, కమర్షియల్ ట్యాక్స్, రెవెన్యూ, అటవీ శాఖ ఇతర శాఖలు సమన్వయం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఈ చెక్ పోస్ట్ వద్ద రూ.1.40 లక్షలను సీజ్ చేసినట్టు సిబ్బంది తెలిపారు. అనంతరం చెక్ పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న మూడు షిఫ్ట్‌ల సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు.

'బాపూజీ'లో ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం బాపూజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ గూడూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంప్రదాయ పండుగలను పాఠశాలలో విద్యార్థులు, టీచర్ల మధ్యన నిర్వహించడం ఎంతో ఆనందదాయంగా ఉంటుందన్నారు. అందులో భాగంగా రంజాన్ వేడుకలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం విద్యార్థులకు తోటి విద్యార్థులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

టూరిజం అభివృద్ధి, రివర్ ఫ్రంట్ ఏర్పాటే లక్ష్యం

మీడియా సమావేశంలో ఆదిరెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కూటమి అధికారంలోకొస్తే నగరంలో టూరిజం అభివృద్ధి, గోదావరి రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తామని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మేనిఫెస్టోను విడుదల చేశారు. రాజమండ్రి టూరిజం హబ్‌పై డిక్లరేషన్ ప్రకటించి మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్‌తో గోదావరి రివర్ ఫ్రంట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తే వైసిపి పాలకుల నిర్లక్ష్యం వల్ల అవి వెనక్కి వెళ్లిపోయాయన్నారు. తాము అధికారంలోకొచ్చిన తరువాత గౌతమీ ఘాట్, సరస్వతీ ఘాట్, పుష్కర్ ఘాట్‌లను, పీవీ నరసింహారావు పార్కు మీదుగా అను సంధానం చేసి, రివర్ ఫ్రంట్ అభివృద్ధి కృషి చేస్తామన్నారు. అయినవిల్లి, ద్వారకా తిరుమల, అన్నవరం, ద్రాక్షారామం ప్రసిద్ధ దేవాలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామన్నారు. రాజమండ్రిలో తొలి సారిగా వాటర్ స్పోర్ట్స్ అడ్వెంచర్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రాజమండ్రిని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దు తామన్నారు. సాంస్కృతిక రాజధానిని వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. టూరిజాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. దీనిపై ఆధారపడ్డ వేలాది కుటుంబాలకు ఉపాధి దూరమైం దన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఘాట్లను శుభ్రపరిచి, సుందరీకరణ చేస్తామన్నారు. అవినీతి తావులేకుండా, మంచి క్వాలిటీతో నిర్మాణాలు చేపడతామన్నారు. తమ కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేసి ఏడాది పూర్తయ్యిందని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది సరిగ్గా ఉగాది రోజునే తమకు అన్ని రకాలుగా వేధింపులకు గురి చేశారని గుర్తు చేశారు. 70 ఏళ్ల దాటిన తన తండ్రి ఆదిరెడ్డి అప్పారావును ఆయన వయస్సును కూడా పట్టించుకోకుండా ఉదయం నుంచి రాత్రి వరకూ అలాగే కూర్చో పెట్టారని, ఆఖరికి తన కుమారుడిని కూడా బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన సతీమణి ఎంఎల్ఎ భవానిని ఎంఎల్ఎ ఎన్నికలకు వెళ్లకూడదంటూ ఒత్తిడి తెచ్చారన్నారు. చంద్రబాబు, లోకేష్‌ల అండదండలు తమకు ఉన్నాయి కాబట్టి వైసిపి ఒత్తిళ్లను ఎదుర్కొనగలిగామన్నారు. ఈ సమావేశంలో ఉమా మార్కండేయ స్వామి ఆలయ మాజీ ఛైర్మన్ ఇన్నమూరి ప్రదీప్, టిడిపి నగర కార్యదర్శి కిలపర్తి శ్రీను, కోశాధికారి శెట్టి జగదీష్, నగర ట్రేడర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి నిమ్మలపూడి గోవింద్, స్వాతి హోటల్ అధినేత సత్యనారాయణ, హరిత టూరిజం అధినేత భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



మేనిఫెస్టో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వాసు తదితరులు